## క్లుప్తంగా

### నిబంధనలకు లోబడి వ్యవహరించండి

టూటౌన్ సీఐ హైమారావు



**నరసరావుపేట టౌన్:** ప్రభుత్వ నిబంధనలకు లోబడే వినాయకచవితి పందిళ్ల నిర్వాహకులు నడుచుకోవాలని టూటౌన్ సీఐ హైమారావు అన్నారు. పందిళ్ల కమిటీ నిర్వాహకులతో గురువారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తి శ్రద్ధలతో వినాయక చవితి పండుగను నిర్వహించుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

**నాదెండ్ల:** ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని యడ్లపాడు ఎస్సై, నాదెండ్ల ఎస్ వి బాల కృష్ణ, జి.పుల్లారావులు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటు చేసే ప్రతి చోటా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మందితో కమిటీ ఏర్పాటు చేసుకుని అనుమతి తీసుకోవాలన్నారు.

### మొక్కల పెంపకంపై సదస్సు

**శావల్యాపురం:** మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు అటవీ యేతర ప్రాంతంలో చెట్లు పెంపకం కార్యక్రమంపై రైతులకు శిక్షణా సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొన పాటి శ్రీనివాసరావు,వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు,ఏపీవో కె.రామారావు, ఫారెస్ట్ బీట్ అధికారి సురేంద్రబాబు,రైతులు పాల్గొన్నారు.

### రొంపిచర్లలో తేలికపాటి వర్షాలు

**రొంపిచర్ల:** మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం తేలికపాటి వర్షాలు కురిశాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం ఉదయానికి 1.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తున్నాయి. అలాగే నరసరావుపేట డివిజన్‌లో 33.6 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా సగటున 3.4 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. చిలకలూరిపేటలో 2.2 ఎం.ఎం., యడ్లపాడులో 11.2, ఈపూరు 2.8, నాదెండ్ల 2.4, నరసరావుపేట 1.4, నూజెండ్ల 2.2, శావల్యాపురం 4.2, వినుకొండ 3.8, బొల్లాపల్లి 2.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది.

### నేడు విద్యుత్ అంతరాయం

**నాదెండ్ల:** నాదెండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. నాదెండ్ల, తూబాడు, చిరుమామిళ్ళ, సంకురాత్రిపాడు, గొరిజవోలు, జంగాలపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే గణపవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకూ గ్రామంలోని శాంతినగర్, మర బావి సెంటర్, ప్రభుత్వ హాస్పిటల్ రోడ్డు, ఎస్సీ కాలనీ, రాజులబజారు, మసీదు బజారు, బొడ్డు రాయి సెంటర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని అధికారులు తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**నాదెండ్ల:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గుంటూరు జీజీహెచ్‌లో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. నాదెండ్ల ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన వలర్తి వెంకటరామరాజు (42) లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. బుధవారం మిత్రుడు శివనాగేశ్వరరావుతో కలిసి ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట నుంచి వస్తూ గణపవరం జంక్షన్ వద్ద వేగంగా వచ్చి బారికేడ్లను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకట రామరాజుకు తీవ్ర గాయాలుకాగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య భాగ్యశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు రామరాజు గతంలో మిలటరీలో పనిచేశారు.

### పోషకాహారంపై అవగాహన

**శావల్యాపురం:** గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాలు కల్గిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత అన్నారు. గురువారం మండలంలోని వేల్పూరు గ్రామంలో అంగన్‌వాడీ సెంటరులో పోషకాహారం మాసోత్సవాలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొమిటినేని అశోక్ చౌదరి, ఆరోగ్య కార్యకర్త యం.అమరలింగేశ్వరి, కార్యకర్తలు శేషకుమారి, రాధ, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

**చిలకలూరిపేటటౌన్:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రూరల్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మండలం పరిధిలోని బొప్పూడి జాతీయ రహదారి జంక్షన్ వద్ద రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో బాపట్ల జిల్లా జె పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన బి ఏలేసును మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు తనిఖీల్లో నిర్ధారించారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. విచారణ చేసిన న్యాయమూర్తి రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా రూరల్ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.



కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో సత్కారం అందుకున్న అధ్యాపకులు



మార్కెట్ సెంటర్‌లో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



ప్రిన్సిపల్ రవినాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం



జేఎన్‌టీయూఎన్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు



ఏఎంరెడ్డి కళాశాలలో కేక్ కట్‌చేస్తున్న కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి

# తస్మైశ్రీ గురువేనమః

- వేర్వేరు ప్రాంతాల్లో ఉపాధ్యాయులను పూజించిన విద్యార్థులు
- మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి చిత్రపటానికి ఘన నివాళి



ఆప్టా ఆధ్వర్యంలో అధ్యాపకులను సత్కరిస్తున్న దృశ్యం



గణపవరం జెడ్పీ హైస్కూలులో...



ఎన్ఈసీలో డాక్టర్ సర్వపల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు

**నరసరావుపేట ఈస్ట్:** పట్టణంలోని విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఆప్టా సెంట్రల్ యూనిట్ ఆధ్వర్యంలో అధ్యాపకులను సత్కరించారు. ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కొండ్రు మోహనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎ స్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఆప్టా సెంట్రల్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అధ్యాపకులను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సమాజంలో ఉపాధ్యాయులకు విశిష్ట స్థానం ఉన్నదని తెలిపారు. వి వాగ్దేవి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పించి సత్కరించారు.

**ఆదర్శనీయుడు డాక్టర్ సర్వేపల్లి**

**నరసరావుపేట:** స్థానిక లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్లోని మదర్ థెరిసా విగ్రహం దగ్గర భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని జనసేన నాయకులు గురువారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మదర్ థెరిస్సా వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనంద్‌బాబు. పట్టణ ప్రధాన కార్యదర్శి ఆర్‌కే.యాదవ్. పట్టణ ఉపాధ్యక్షులు చిన్నపల్లి సాంబ, పట్టణ ప్రధాన కార్యదర్శి గుప్తా శ్రీకాంత్. పోతంశెట్టి రాము పాల్గొన్నారు.

**రొంపిచర్లలో...**

**రొంపిచర్ల:** మండలంలోని పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో-2 డి. బ్రహ్మేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య ఉన్న సంబంధం విడదీయ రానిదన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవినాయక్, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ వనిపెంట రామిరెడ్డి, గ్రామ పెద్దలు వనిపెంట పిచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వేర్వేరు కళాశాలలో..**

**నరసరావుపేట రూరల్:** మండలంలోని పలు కళాశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూఎన్ కళాశాలలో నిర్వహించిన గురుపూజోత్సవ దినోత్సవంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొని మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి పాల్గొని డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఏఎం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎంఏ శేషగిరిరావును ఉపాధ్యాయులు సత్కరించారు.

**సన్మార్గంలో నడిపేది గురువులే**

**బొల్లాపల్లి:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత**

మండలంలోని కనుమలచెరువు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.కోటానాయక్ ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే సీహెచ్. అరవిందబాబు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వి.కోటానాయక్‌ను మండల విద్యాశాఖ అధికారులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

**ఈపూరులో...**

**ఈపూరు:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈపూరు శాఖా గ్రంథాలయంలో గురుపూజోత్సవం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు శతక పద్యాల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పూజారి జగన్మోహిని, గ్రంథాలయ నిర్వాహకులు జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**వినుకొండలో....**

**వినుకొండ(నూజెండ్ల):** స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న లయోలా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవ.పా. ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు మార్నేని జ్ఞాన సుందరరావులు హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టి.వీర, లక్ష్మీ శైలజ, మేరి, రాజేశ్వరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కంభంపాడులో...**

నూజెండ్ల మండలంలో కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వి.నరసింహారావు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎనలేని సేవలు అందించారని, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని, వారి జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్. అంజిరెడ్డి, టి. శ్రీనివాసరావు, జి.చిన్నగోవిందు, ఎఎస్ఎస్ సూర్యప్రకాష్‌రావు, ఎల్. రామాంజిరెడ్డి, అన్నామణి తదితరులు పాల్గొన్నారు.

**శావల్యాపురంలో...**

**శావల్యాపురం:** సమాజంలో విద్యార్థులను సృజనాత్మకంగా తీర్చిదిద్దే పాత్ర ఉపాధ్యాయులదేనని వివేకనంద యూత్ కమిటీ అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు అన్నారు. గురువారం మండలంలోని వేల్పూరు జడ్పీ ఉన్నత పాఠశాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు సందర్భంగా ఘనంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఈపూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం జగన్మోహిని, శ్రీనివాసరావు

**నాదెండ్లలో....**

**నాదెండ్ల:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముందుగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఐ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు నాగశైలజారాణి, సైన్స్ ఉపాధ్యాయుడు కళ్ళెం రత్నరాజుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు పొందిన సందర్భంగా వారిని సత్కరించారు. కార్యక్రమంలో పీడీ వేణుగోపాల్, పీఈటీ జ్యోస్తి శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నలుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు**

మండలంలోని చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న నాగరాజు, కనపర్రు జెడ్పీ హైస్కూలు పీఈటీ షేక్ బాజీ, గణపవరం జెడ్పీ హైస్కూలులో ఇంగ్లిష్ ఉపాధ్యాయిని నాగశైలజా రాణి, సైన్స్ ఉపాధ్యాయుడు కళ్ళెం రత్నరాజుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు దక్కాయి. జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, డీఈవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఈవో వేణుగోపాల్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. వారిని పలువురు అభినందించారు.

### మొక్కనాటి.. స్ఫూర్తినింపి...



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**శావల్యాపురం:** అడవులు నరకడం ప్లాస్టిక్ వంటి వ్యర్థాల వలన పర్యావరణానికి హాని కలుగుతుందని శ్రీరామా పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కె.వి.ఆర్. మోహన్‌చందు అన్నారు. గురువారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి, డైరెక్టరు కె.అజిత్‌చంద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉజ్వల భవిష్యత్ కల్పించేది ఉపాధ్యాయులే



ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు



బీఆర్ఐజీ మున్సిపల్ పాఠశాల హెచ్ఎంను సన్మానిస్తున్న మిత్రా సొసైటీ సభ్యులు

**చిలకలూరిపేట:** తల్లిదండ్రులు జన్మనిస్తే, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ కల్పించేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని శ్రీశారదా జెడ్పీ హైస్కూల్‌లో గురుపూజోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువును దైవంగా భావించే గొప్ప సంస్కృతి మనదని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని, ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని వెల్లడించారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన ఘనత ఆయనదని కొనియాడారు. మరో అతిథి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి నడవడిక అలవర్చేది ఉపాధ్యాయులేనని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, తదితరులు పాల్గొన్నారు. మిత్రా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బీఆర్ఐజీ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం జీవీ రమణరావును సన్మానించారు.



వినుకొండ లయోలా స్కూల్లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



నూజెండ్ల మండలంలో కంభంపాడులో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వేల్పూరు వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు



బండ్లమోటు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

## శాంతియుతంగా ఉత్సవాల నిర్వహణ జరగాలి

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

**నరసరావుపేట:** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వీడియా కాన్ఫరెన్స్ ద్వారా వివిధ స్టేషన్లలోని పోలీసు అధికారులు, మహిళా పోలీసులకు పలు సూచనలు చేశారు. ముందుగా మండపాన్ని ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండే ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించాలని కోరారు. ప్రతి మండపానికి కనీసం ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేయించడం ద్వారా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోనీయకుండా ఉండడం జరుగుతుందన్నారు. మండపానికి దగ్గర్లో ఇసుక, నీరు ఏర్పాటు చేయడం ద్వారా ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఉపయోగపడుతుందని అన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశం వద్ద కనీసం ఐదు లేదా ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, క్రేన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.



కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ చేస్తున్న సూచనలను వింటున్న అధికారులు, మహిళా పోలీసులు

## నేడు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**నరసరావుపేట ఈస్ట్:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకల్పవల్లి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 6వతేదీ శుక్రవారం ఉదయం 10.45 గంటలకు శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు శ్రీవాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. పర్యావరణానికి హితంగా ఉండేలా దాదాపు 1512 మట్టి గణపయ్యలను భక్తులకు అందచేస్తామని వివరించారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి



**చిలకలూరిపేటటౌన్:** ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గతనెల 29వ తేదీన పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్లో గుర్తు తెలియని సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధుడు అనారోగ్యంతో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం గుంటూరు తరలించగాఅక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.